విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

విద్యార్థులను వేధిస్తున్న యాజమాన్యాలు: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - విశాఖ: ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులను ఫీజుల కోసం భయాందోళనలకు గురిచేస్తూ వేధిస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్, విశాఖ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టి మాట్లాడారు. ఇటీవల అనంతపురం జిల్లాలో నారాయణ కళాశాలలో చదువుతున్న భవ్యశ్రీ అనే విద్యార్థినిని ఫీజు కట్టాలని లేకపోతే రికార్డ్స్ ఇవ్వబోమని కళాశాల యాజమాన్యం తీవ్ర భయాందోళనలకు గురి చేయడంతో ఆ విద్యార్థిని కళాశాల భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. తల్లిదండ్రుల మధ్య

మనస్పర్థల కారణంగా అమ్మమ్మ ఇంట్లో ఆ విద్యార్థిని చదువుకుంటోందని అన్నారు. ఆ బాధ నుండి బయట పడకముందే నారాయణ కళాశాల యాజమాన్యం ఫీజు కోసం ఒత్తిడి చేయడంతో ఆ అమ్మాయి భయభ్రాంతులకు గురైందని అన్నారు. విశాఖలో కొన్ని నెలల క్రితం పరదేశిపాలెంలో ఉన్న నారాయణ కళాశాల హాస్టల్ లో ఒక అబ్బాయి చనిపోయాడని, దీనిపై విశాఖపట్నం ఆర్ఐఓ వినోద్ బాబుకి దర్యాప్తు చేయాలని వినతిపత్రం ఇచ్చామని, ఎటువంటి దర్యాప్తు లేకుండానే ఆయనని బదిలీ చేశారని అన్నారు. విద్యను వ్యాపారం చేస్తూ తల్లిదండ్రులను మధ్య పెట్టి లక్షలలో ఫీజు వసూలు చేస్తూ విద్యార్థులకు కనీసం ప్రభుత్వం ప్రకటించిన సెలవులు కూడా ఇవ్వకుండా తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీను, నాయకులు పవన్, జీవన్, శేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ పేరుతో అక్రమ వసూళ్లపై ఫిర్యాదు చేస్తాం

అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్

విశాలాంధ్ర - విశాఖ: ఎలమంచిలి, పాయకరావుపేట ఏరియాల్లో ఏఐఎస్ఎఫ్ పేరు చెప్పి రమణ, బాలాజీ స్థానికంగా ఉన్న హాస్టల్ వార్డెన్ల నుంచి, కళాశాల యాజమాన్యాల నుంచి అక్రమంగా దాదాపు లక్ష రూపాయలు బెదిరించి వసూలు చేసారని, వారితో ఏఐఎస్ఎఫ్‌కి ఎటువంటి సంబంధం లేదని ఏఐఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏఐఎస్ఎఫ్ పేరు చెప్పి డబ్బులు వసూలు చేస్తూ వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి వారి వల్ల విద్యార్థి సంఘాలకు చెడ్డ పేరు వస్తోందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ పేరు చెప్పి అక్రమ వసూళ్ళకు పాల్పడిన వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

మెడికల్ కళాశాల నిర్మాణంతో మెరుగైన వైద్య సేవలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణంతో నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందనున్నాయని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. బుధవారం మాకవరపాలెం మండలం భీమ బోయినపాలెం వద్ద మెడికల్ కళాశాల నిర్మాణానికి సంబంధించి కాంక్రీట్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలకు మెడికల్ కళాశాల నిర్మాణం ఒక వరమన్నారు. ఈ మెడికల్ కళాశాలలో నర్సింగ్ కోర్సులు కూడా ప్రారంభమౌతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షులు రుత్తల వాసు, వైసీపీ నాయకులు హరిబాబు, పెట్ల భద్రాచలం, గోవిందు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

విశాలాంధ్ర - ఆనందపురం: అంతర్జాతీయ స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో భారతదేశం తరుపున వివిధ విభాగాల్లో పాల్గొన్న మన జిల్లా క్రీడకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి వివిధ పతకాలు సాధించినట్లు స్కై మార్షల్ ఆర్ట్స్ కోచ్ లెంక అప్పలరాము తెలిపారు. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన 7వ సౌత్ ఏషియన్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మిందివానిపాలెం గ్రామానికి చెందిన నాగిశెట్టి జ్ఞానవర్ధన్ అండర్ - 14 విభాగంలో ప్రతిభ చూపి సిల్వర్ మెడల్ అందుకున్నారు. ఈ సందర్భంగా స్కై ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ నజీర్ అహ్మద్‌తో పాటు జిల్లా స్కై అధ్యక్షులు ఆబోతు అప్పలరాము తదితరులు అభినందించారు.

పోస్టుమార్టం చేసే వ్యక్తిని ప్రభుత్వమే నియమించాలి

విశాలాంధ్ర - జికేవీధి: చింతపల్లి ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయడానికి పర్మినెంట్‌గా ఒకరిని నియమించాలని జికేవీధి మండలం గాలికొండ ఎంపీటీసీ అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చింతపల్లి, జికేవీధి మండలంలో వివిధ కారణాల వల్ల మరణించిన వారికి పోస్టుమార్టం ప్రైవేట్ వ్యక్తి ద్వారా చేయించడం వల్ల ఆయన భారీగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని దీంతో పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున చింతపల్లి ఆసుపత్రిలో ప్రభుత్వమే ఒకర్ని నియమించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

పాఠశాలలో ఘటనపై ఆర్జేడీ దర్యాప్తు

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని మార్పు కున్న పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆర్జేడీ జ్యోతి కుమారి బుధవారం సందర్శించారు. ఈ పాఠశాల భవనం స్లాబ్ పెచ్చులు పడి ముగ్గురు విద్యార్థులు గాయపడిన సంఘటనపై దర్యాప్తు జరిపారు. పాఠశాల భవన నిర్మాణం పనులు నాసిరకంగా ఉన్నాయని స్లాబ్ సీలింగ్ గంటలు కొట్టకుండా ప్లాస్టింగ్ చేయించారని ఇంజనీరింగ్ అధికారులను ఆమె నిలదీశారు. ఇంజనీరింగ్ అధికారులు భవన నిర్మాణ సమయంలో పర్యవేక్షణ లేకపోవడం వలన ఈ ప్రమాదానికి కారణమని వారిపై ఆమె మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఆమె వెంట జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, ఇంజనీరింగ్ అధికారులు తదితరులు ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: మండల సచివాలయం కన్వీనర్ రాజాన విజయ్ కుమార్ ఆధ్వర్యంలో గృహ సారథులకు, వలంటీర్లకు పలు సూచనలిచ్చారు. బుధవారం ఉప్పవరం, ఎమ్.జె.పురం సచివాలయాల పరిధిలో గల గృహసారధులకు, వలంటీర్లకు మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంపై ఆయన అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్ళడంలో అహర్నిశలు పాటుపడాలన్నారు. సచివాలయం కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టిన రాజాన విజయ్ కుమార్‌కు ఆయా గ్రామాల నాయకులు శాలువా, పూలగుచ్చాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రమాదాల నివారణ పారిశుధ్య నిర్మూలన లక్ష్యంగా ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలతో చింతపల్లి పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. వారపు సంతలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించడంలో భాగంగా లంబసింగి నుండి చింతపల్లి వచ్చే వాహనాలను ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా, అదేవిధంగా చౌదుపల్లి నుంచి చింతపల్లి వైపు వచ్చే వాహనాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నిలుపుదల చేసే విధంగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు లోతుగెడ్డ జంక్షన్ వద్ద వేగ నియంత్రణ చేయడానికి ముఖ్య కూడలిలో డ్రమ్ములను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అరుణ్ కిరణ్, సిఆర్పిఎఫ్, ఏపీఎస్పీ, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

సర్వేక్షన్‌లో భాగంగా స్పెషల్ డ్రైవ్

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 91వ వార్డు బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీ శ్రీ తోట పోలమాంబ అమ్మవారి గుడి దగ్గర స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు, జోన్ 8 కమిషనర్ మల్లయ్య నాయుడు విచ్చేసి స్వచ్ఛ సర్వేక్షన్‌పై ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని తెలియజేస్తూ తడి పొడి, ప్రమాదకరమైన చెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, కడితి రాజు, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, చుక్క పైడిరాజు రెడ్డి, కన్వీనర్లు దానియాలు, తమ్మి రెడ్డి, చుక్క విజయ, కనక మహాలక్ష్మి, ఆర్పిలు నీరజ, సుబ్బలక్ష్మి, జ్యోతి, సూర్య కుమారి, గొడ్డు నాగరాజు, ఎం.అప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆధార్ నమోదు సేవలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: విద్యార్థులందరూ ఆధార్ నమోదు సేవలను వినియోగించుకోవాలని అయ్యన్న విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ ఖాశీం సూచించారు. స్థానిక అయ్యన్న కళాశాలలో బుధవారం "ఆధార్ అథంటికేషన్ ప్రోగ్రాం" నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాశీం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ద్వారా కళాశాలకు వచ్చి అందిస్తున్న ఈ ఆధార్ నమోదు సేవలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పోతల మౌనిక, రెడ్డి జనార్ధన్, కళాశాలల అధ్యాపకులు సీముసురు రమణ, కళ్యాణి పాల్గొన్నారు.

అశ్లీల నృత్య నిర్వాహకులపై కేసు నమోదు

విశాలాంధ్ర - రావికమతం: మండలంలో గొంప గ్రామంలో అశ్లీల నృత్యం ఏర్పాటు చేసిన నిర్వాహకులపై కేసు నమోదు చేశామని కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. బుధవారం రావికమతం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా దారు. గ్రామ దేవత పండగ సందర్భంగా మండలంలో టి.అర్జాపురం గ్రామానికి చెందిన చంద్రావు అనే వ్యక్తి ట్రాన్స్‌జెండర్‌లను గొంప తీసుకొచ్చి అశ్లీల నృత్యం ఏర్పాటు చేశారన్నారు. చంద్రరావును, కాంట్రెడ్డి సత్తిబాబు, మట్ట చిరంజీవిలపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

మండలంలో సమ్మర్ క్రాష్ ప్రోగ్రాం

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రంలో సమ్మర్ క్రాష్ ప్రోగ్రామ్‌ను ఎంపీపీ కొర్ర పద్మ, ఎంపీడీఓ లోహిత్ జయ సాగర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 45 రోజుల పాటు అన్ని గ్రామాల్లో పాడైన బోర్లను మరమ్మతులు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ విజయకుమార్, బోర్ మెకానిక్ బాలు, సెక్రటరీలు నాయుడు, చిన్నం నాయుడు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: మత్తు పదార్థాల వినియోగానికి విద్యార్థులు దూరంగా ఉండి వారి భవిష్యత్తును బంగారు బాటగా తయారు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.చిన్నారావు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థులచే ర్యాలీని నిర్వహించారు. అనంతరం విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదువుకోవాలని, మత్తు పదార్థాలను నిరోధించాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవం పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కశింకోట: కశింకోట శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవం పోస్టర్‌ను రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ సతీమణి హిమగౌరి బుధవారం ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూర్వ సంస్కృతి సంప్రదాయబద్దంగా ఈ ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నాయకులు వేగి గోపికృష్ణ, పెంటకోట రాము, బొడ్డేడ బాలాజీ, దాడి నాగరాజు, ఆడారి నరిశింగరావు, కొయిలాడ నాగు, పెంటకోట తాతారావు తదితరులు ఉన్నారు.

ఘనంగా గారా ప్రసాద్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్: ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ గారా ప్రసాద్ జన్మదిన వేడుకలు పాయకరావుపేటలో ఘనంగా జరుపుకున్నారు. వైసీపీ నాయకులు, పంచాయతీ వార్డు సభ్యులు, అభిమానులు సమక్షంలో వేడుకలు నిర్వహించారు. వైసీపీ నాయకులు జగతా శ్రీను ఆధ్వర్యంలో వార్డు సభ్యులు గజమాలతో ఘనంగా అభినందించారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు ఎంఎస్ఎన్ మూర్తి, దాసరి శ్రీను, ధనిశెట్టి మహేష్, పెంకే గోవిందు, మలిపెద్ది వెంకటరమణ, కొప్పిశెట్టి రామ్మోహన్, సలికే సతీష్, పెదిరెడ్డి నాగ వెంకట రమణ, దేవాది మంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ కోర్టు కేసుల విచారణ వాయిదా

విశాలాంధ్ర - పాడేరు: ఈనెల 10వ తేదీన ఐటీడీఏలో నిర్వహించవలసిన కోర్టు కేసుల విచారణ తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రోణంకి గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. తదుపరి కోర్టు కేసులు విచారణ ఎప్పుడు నిర్వహించేది కక్షిదారులకు నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం కోర్టు కేసు నిమిత్తం ఎవరు ఐటిడిఏకి రావద్దని కోరారు.

సమాచార శాఖలో భమిడిపాటి సేవలు మరవలేనివి

ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వి.మణిరామ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సమాచార శాఖలో వివిధ హోదాలలో విధులు నిర్వహించిన భమిడిపాటి జగన్నాధరావు సేవలు మరువలేనివని సమాచార శాఖ ప్రాంతీయ సంయుక్త సంచా లకులు వి.మణిరామ్ అన్నారు. బుధవారం సాయంత్రం సమాచార శాఖలో భమిడిపాటి జగన్నా ధరావు ఆకస్మిక మరణానికి సంతాప సభ ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1984 నుండి 6 సంవత్సరములు పాటు విశాఖ జిల్లాలో వివిధ హోదాలలో విధులు నిర్వహించిన అనంతరం పదోన్నతిపై గవర్నర్ ప్రెస్ సెక్రటరీగా, సమాచార శాఖలో జాయింట్ డైరెక్టరుగా పనిచేశారని, 89 సంవత్సరాల వయసులో ఈ నెల 6వ తేదీన తుది శ్వాస విడిచారని ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉప సంచాలకులు పి.గోవిందరావు, సహాయ సంచాలకులు ఆర్.త్యాగరాజు, సమాచార శాఖ సూపరి ంటెండెంట్ జివికెఎస్.ప్రసాదు, ఎఐఐఇ సిహెచ్.మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి సహకరించాలి: ఆర్డీఓ జయరాం

విశాలాంధ్ర - పాయకరావుపేట: పాయకరావుపేట మెయిన్‌రోడ్డు విస్తరణ పనులకు అందరూ సహకరించాలని నర్సీపట్నం ఆర్డీఓ హెచ్.వి. జయరాం కోరారు. మెయిన్ విస్తరణ పనులకు కొనసాగించేందుకు అధికారులు, రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులతో చర్చించేందుకు వచ్చిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మెయిన్‌రోడ్డు విస్తరణకు సుమారు రూ.6 కోట్లు నిధులు విడుదలై ఉన్నట్లు తెలిపారు. ఈ నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, ఆలస్యం చేస్తే నిధులు వెనక్కు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. కొంతమంది రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులు కోర్టుకు వెళ్లారని తెలిపారు. రోడ్డు వేసినంత మాత్రాన వారి వ్యాపారాలకు ఇబ్బందులు ఉండవన్నారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు వేయాల్సి ఉందని, ప్రస్తుతం టెక్నాలజీతో రోజుకు 300 మీటర్ల చొప్పున రోడ్డు వేయవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా అధికా రులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జైప్రకాష్, ఈఓపీఆర్‌డి సీహెచ్ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి జె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అన్నం పెట్టిన అన్న క్యాంటీన్ ధ్వంసం

ఖరీదైన తలుపులు, కిటికీలు, ఫర్నిచర్ మాయం

విశాలాంధ్ర - గాజువాక సిటీ: గాజువాక 73వ వార్డు కైలాష్ నగర్ 130 అడుగుల వుడా రోడ్డు నందు ఎంతో మంది పేదలకు, విద్యార్థులకు, భవన కార్మికులు, ఆటో కూలీలలకు కడుపు నింపిన అన్న క్యాంటీన్ ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రావడంతో మూతపడింది. దీంతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకూ, మందుబాబులకు అడ్డాగా మారిపోయింది. మద్యం సేవించి ఖాళీ చేసిన మందు సీసాలు విచ్చిముక్కలతో నిండిపోయి శిధిలా వస్థలో ఉంది. ఈ క్రమంలో ఈ క్యాంటీన్‌ను ఎవరో ధ్వంసం చేసి గోడలు, టైల్స్ గచ్చును పగులగొట్టి ఖరీదైన తలుపులు, కిటికీలు ఫర్నిచర్‌ను ఎత్తుకెళ్లి పోయారు. అటువైపుగా వెళ్ళే ఎందరో అన్నార్తులు అన్నమో రామ చంద్రా అనే అభాగ్యులు కూలీలు, భవన కార్మికులు, ఆటో కార్మికులు, పేద విద్యార్థులు ఎప్పటికైనా ఇక్కడ మరలా అన్నం పెట్టకపోతారా అని ఆశగా ఇటువైపు చూసే వాళ్లకు ధ్వంసం కాబడి నాకెవరు దిక్కూ అంటూ అనాధగా మిగిలిపోయింది. దీనికి ప్రధాన కారణం అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యమేనని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విలువైన ప్రజా ఆస్తిని కాపాడుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు పలు ప్రజా సంఘాలు కోరుకుంటున్నాయి.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్)గా సురేష్ చంద్ర పాండే

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని నవరత్న రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్‌కి సురేశ్ చంద్ర పాండే తదుపరి డైరెక్టర్ (పర్సనల్)గా మారనున్నారు. పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ సెలక్షన్ బోర్డ్ (పిఇఎస్‌బి) ప్యానెల్ మంగళవారం ఆయనను ఈ పదవికి సిఫార్సు చేసింది. ప్రస్తుతం, అతను స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సాయిల్)లో చీఫ్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. తొమ్మిది మంది అభ్యర్థులలో ఆరుగురు అభ్యర్థులు విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచి ఒకరు, ఒకరు సెయిల్, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్ నుండి ఒక్కొక్కటి డైరెక్టర్ (పర్సనల్)గా, పాండే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లో సభ్యుడిగా ఉంటారు.

సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ ఈడీ హామీ

ఎంప్లాయిస్ యూనియన్

విశాలాంధ్ర - విశాఖ: ఆర్టీసీ విజయనగరం జోన్ 1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి.రవి కుమార్, డిప్యూటీ సీపీఎం సుధా బిందులతో ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ అధ్యక్షులు కేజే సుభాకర్, వర్కింగ్ అధ్యక్షులు కె.శంకర్రావు, జోనల్ కార్యదర్శి బాసూరు కృష్ణమూర్తి, జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ నారాయణ, వర్క్‌షాప్ రీజియన్ అధ్యక్షులు కే.ఏ.రాజు, వర్క్‌షాప్ రీజనల్ కార్యదర్శి వి.ఎర్రం నాయుడు సమస్యలపై చర్చించారు. ఈ చర్చల్లో ముఖ్యంగా ఓటి డ్యూటీలపై, శ్రీకాకుళం-2 డిపోలో ప్రస్తుత సమస్యలపై, బదిలీలకు సంబంధించి, ప్రమోషన్లకు సంబంధించి, ఏఏఎస్ ఇంక్రిమెంట్లకు సంబంధించి ఏజెండాలో ఉన్న అంశాలన్నింటిపైన చర్చించారు. ఈడీ సానుకూలంగా స్పందించి తన పరిధిలో ఉన్న సమస్యల్ని పరిష్కరించి, మిగితా వాటిపై, హెడ్ ఆఫీస్‌లో పరిష్కారం చేసేందుకు హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం హామీ ఇచ్చిన ఇడికి, డిప్యూటీ సిపిఎంకి ఎంప్లాయిస్ యూనియన్ జోనల్ కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది.

అంగన్వాడీ కేంద్రానికి హాట్‌బాక్స్ అందజేత

విశాలాంధ్ర - కొమ్మాది: గర్భిణులకు అందజేసే పౌష్టికాహారం వేడిగా ఉండేందుకై కీ.శే కొర్రాయి గోవిందరావు జ్ఞాపకార్థం కనకదుర్గ సప్లయర్స్ అధినేత కొర్రాయి సురేష్ ధన సహాయంతో వివేకానంద కాలనీ అంగన్వాడీ కేంద్రానికి హాట్ బాక్స్ అందజేశారు. ఆహారం చల్లగా అయిపోవడంతో గర్భిణులు ఇబ్బంది పడేవారని, నేటి నుంచి అలాంటి సమస్య ఉండదని అంగన్వాడీ నిర్వాహకురాలు శ్రీదేవి తెలిపారు. ఈ హాట్‌బాక్స్ అందజేసిన సురేష్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుంటుబోయిన కిషోర్, గణేష్ పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధికి కోరమండల్ ఆర్థికసాయం

విశాలాంధ్ర - మల్కాపురం: కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ అరుణ్ అలగప్పన్ బుధవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా జీవీఎంసీ పరిధిలో గల 58వ వార్డ్ అభివృద్ధి నిమిత్తం ఆర్థికసాయం చేశారు. ఎదురువాణిపాలెం గ్రామంనకు 18 లక్షలు, కుంచమ్మ కాలనీకి 15 లక్షలు, గుల్లలపాలెంనకు 17 లక్షలు కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు 58వ వార్డ్ కార్పొరేటర్ లావణ్యకి 50 లక్షల రూపాయల చెక్కును జోనల్ కమిషనర్ ఆర్జీవి కృష్ణ, ములగాడ మండల రెవెన్యూ అధికారి వీర బద్దర్‌రావు సమక్షంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో 58వ వార్డ్ వైసీపీ అధ్యక్షులు గులిగిందల కృష్ణ, సంస్థ ప్రతినిధులు జ్ఞానసుందర్, డివిఎస్ రాజా, రెడ్డిపల్లి శ్రీనివాస్‌రావు, కార్పొరేట్ సిఎస్ఆర్ ప్రతినిధి అమృత తదితరులు పాల్గొన్నారు.

పది రోజుల్లో ధాన్యం కొనుగోలు

విశాలాంధ్ర - మాకవరపాలెం: పది రోజుల్లో పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామని మండల వ్యవసాయాధికారి చిరంజీవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సోమ, మంగళవారాల్లో మాకవరపాలెం, కొండలఅగ్రహారం, పైడిపాల, గిడుతూరు తదితర గ్రామాల్లో 320 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ధాన్యాన్ని గిడుతూరు, ఏటిగైరంపేట మిల్లులకు తరలించినట్లు తెలిపారు.

టార్గెట్‌బాల్ అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలి

గీతం అధ్యక్షుడు శ్రీభరత్

విశాలాంధ్ర - మధురవాడ: భారతీయ క్రీడగా ఇటీవలి కాలంలో అభివృద్ధి చెందిన టార్గెట్ బాల్‌లో భారతీయ యువత అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని గీతం విద్యాసంస్థల అధ్యక్షుడు ఎమ్.శ్రీభరత్ ఆకాంక్షను వ్యక్తం చేశారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ (ఎ.ఐ.యు) ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా బుధవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల టార్గెట్‌బాల్ పోటీలను (పురుషుల విభాగం) ఆయన ప్రారంభించారు. టార్గెట్ బాల్ వంటి నూతన క్రీడల ద్వారా త్వరితంగా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభించగలదని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ టార్గెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు సోనూశర్మ, గీతం క్రీడా విభాగం డైరెక్టర్ అరుణ్‌కార్తీక్, గీతం ప్రోవైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, గీతం క్రీడా విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నడిచే దేవుడు సింహాద్రి అప్పన్న

శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామివారిని కంచి కామకోటి 70వ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి దర్శించుకున్నారు. వీరికి ఆలయ మర్యాదలతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, ఆలయ ప్రధాన అర్చకులు గోడవర్తి శ్రీనివాసచార్యులు, స్థానాచార్యులు డాక్టర్ టి.రాజగోపాల్, అర్చక బృందం వేద పండి తులు అలంకారి సీతారామాచార్యులు

నాదస్వర వేదమంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి వారి దర్శనం అనంతరం వేద పండితులచే వేద ఆశీర్వచనములు కావించి స్వామి వారిని సత్కరించి ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో సింహాద్రి అప్పన్న నడిచే దేవుడని, అప్పన్న అని పిలిస్తే ఎటువంటి పదైన నశిస్తుంది అన్నారు. తదుపరి స్వామి వారి కళ్యాణమండపం నందు ప్రవచనాలు కావించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. వీరితో ఆలయ ధర్మకర్తలు దినేష్ రాజు సంపంగి శ్రీనివాసరావు, ప్రత్యేక ఆహ్వానితులు నరసింహమూర్తి, ఏఈఓ రమణ మూర్తి, నరసింహారాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు, రాంబాబు, పీఆర్వో నాయుడు, ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు తదితరులు స్వామివారితో ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

విశాలాంధ్ర - మునగపాక: మండలంలో వాడ్రాపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు ఆధ్వర్యంలో మునగపాక సబ్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ ఆలీ సమీక్షలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, ఆన్లైన్ యాప్స్ బహుమతులు పలికాయని చెప్పి వచ్చే ఫేక్ ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా వుండాలన్నారు. ఫేక్ ఫోన్ కాల్స్ పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

పిల్లలను పాఠశాలలకు పంపించాలి

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని మహిళా పోలీసు గిర్వాణి, ప్రదానోపాధ్యాయులు వి.భూషణ్ అన్నారు. మండల పరిధిలో గల మారుమూల లక్ష్మీపురం పంచాయతీకి చెందిన కోడాపుట్టు గ్రామంలో గ్రామస్తులతో, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళ పోలీస్ గీర్వాణి మాట్లాడుతూ 100 పోలీస్ శాఖ, 108, 104, ఆరోగ్య వైద్యసేవలపై ప్రజలకు అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. అత్యవసర సమయాల్లో ఆయా నెంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించి సమస్యలు పరిష్కరిం చుకోవచ్చని ఆమె అన్నారు. డ్రాప్ అవుట్ అయిన పిల్లలను పాఠశాలలో చేర్పించాలని సకల సదుపాయాలు వున్నాయని హెచ్ఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివా లయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా నాక్లయింటైన విశాఖపట్నంజిల్లా పద్మనాభం మండలం, అనంతవరం వాస్తవ్యులైన బైలపూడి బెన్ని గారి కుమార్తె **బైలపూడి గౌరమ్మ** గారు ఇచ్చిన భోగట్టామేరకు,

ఈక్రింది షెడ్యూలు ఆస్తిని విశాఖపట్నం జిల్లా, పద్మనాభం మండలం, అయినాడ గ్రామం, డో.నెం. 1-25రు కాలు లేటు కొల్లి ఎర్రయ్య గారి భార్య **కొల్లి సూర్యకాంతం** గారి వద్దనుండి నాక్లయింటు కొనుగోలుచేయ నిశ్చయించుకొని రిజిష్టర్డు క్రయము పొందుటకు సంసిద్ధులైయున్నారు.

కావున ఈ క్రింది షెడ్యూలు ఆస్తి పై ఎవ్వరికైననూ ఎట్టి తనఖాలు, జప్తులు, క్రయపురోణీలు, హక్కులు వగైరాలు ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలున్నయెడల ఈ ప్రకటన వెలువడిన తేది లగాయితు **7 రోజులలోపు** ఈక్రింది అడ్రస్‌కు లిఖితపూర్వకముగా తగు సాక్ష్యాధారములతో తెలియపర్చవలెను. లేనియెడల షెడ్యూలు ఆస్తి నిర్వివాదపు ఆస్తి అని నా క్లయింటు భావించి రిజిష్టర్డు క్రయము పొందుదురు. ఆ తదుపరి వచ్చు అభ్యంతరములు, ఆక్షేపణలు నా క్లయింటు హక్కులను బంధింపజాలవు.

<u>షెడ్యూలు ఆస్తి</u>

విశాఖపట్నం జిల్లా, భీమునిపట్నం సబ్ రి॥ పద్మనాభం మండలం, బాపిరాజు కొత్తపలస గ్రామ పంచాయితీకి చెందిన బుద్దివలసగ్రామం తాలూకా జిరాయితీ మెట్టు పట్టా నెం. 93, సర్వే నెం.54-16P రులో గల య.0.42సెంట్లు లేక 0.168 హెక్టార్లున్నూ మరియు సర్వే నెం. 61-1రులో గల య.0.36సెంట్లు లేక 0.144 హెక్టార్లు వెరశి య.0.78సెంట్లు లేక 0.312 హెక్టార్లు విస్తీర్ణం గల జిరాయితీ మెట్టు భూమికి హద్దులు: **తూర్పు:** సుంకర చిన్నయ్య వగైరాల మెట్టు భూమి, **దక్షిణం:**రస్తా, **పడమర:** చందక సూర్యనారాయణ గారి మెట్టు భూమి, **ఉత్తరం:** లింగాల గురయ్య వగైరాల మెట్టు భూమి.

CH. SURYANARAYANA REDDY, Advocate
#3-53, Gudivada Village, Bhogapuram (M)
Vizianagaram District. **Cell: 99664 93924**

తరాలు మారినా గిరిజనుల బ్రతుకులు మారలేదు!

పేరుకు మాత్రమే గిరిజనులు
ప్రభుత్వం నుంచి అందని పథకాలు
5వ షెడ్యూల్‌లో చేరిస్తేనే గుర్తింపు

విశాలాంధ్ర - వి.మాడుగుల: తరాలు మారినా, తాతలు మారినా నాన్ షెడ్యూల్డ్ ఏరియాలో గిరిజనుల బ్రతుకులు మారలేదు. జిల్లాలోని నర్సీపట్నం చోడవరం, వి.మాడుగుల నియోజకవర్గాలలో దాదాపుగా 320 గిరిజన గ్రామాల్లో 95 వేలు మంది జనాభా ఉన్నారు. వీరు పేరుకు మాత్రమే గిరిజనులు. వీరికి ప్రభుత్వం నుండి వచ్చే ప్రత్యేక మైన రాయితీలు, సంక్షేమ పథకాలు, స్కీములు, రిజర్వేషను, స్పెషల్ డిఎస్సి లాంటి ఉద్యోగాల్లో అవకాశం లేదు. 1/70 భూ బదలాయింపు లాంటి చట్టం వర్తించడం లేదు. విద్య, వైద్యం ఉపాధి అవకాశాలు అంతంత మాత్రంగానే అందుతున్నాయి. రాజకీయ రిజర్వేషన్లు సైతం గిరిజనేతరుల చేతుల్లో ఉంటున్నాయి. వీరిని రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డ్‌లో చేరిస్తేనే గిరిజనులకు గుర్తింపు వస్తుంది. పాలకులకు వీరి గోడు పట్టడం లేదు. అనేక ఎళ్ళ పోరాట ఫలితంగా ఎట్టకేలకు వైఎస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత గిరిజన సలహా మండలి నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాల యొక్క జాబితాను అడిగింది. తహశీల్దార్లు జాబితాలను తయారు చేసి జిల్లా కలెక్టర్లకు పంపించారు కానీ ఈ మూడు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇప్పటికే నాన్ షెడ్యూల్డ్ ఏరియాలోని గిరిజనులు అన్నివిధాలా అభివృద్ధి చెందారు. జిల్లాలు పునర్విభజన తరువాత అల్లూరి జిల్లాగా పాడేరు ఏర్పడింది. ఇప్పటి వరకు ఎంతో కొంత నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజనులకు సమస్యలు చెప్పుకునే ఐటీడీఏ కూడా లేకుండా పోయింది. వీరి కష్టాలు చెప్పుకోవడానికి ఇప్పటి వరకు ప్రత్యేక అధికారి లేకపోవడంతో గిరిజనుల బ్రతుకులు మరింత అయోమయంలో పడ్డాయి. కేటిపాలెం, బొర్రచింత, రామాన్నపాలెం, కోడాపల్లి, పూలగరువు, బుచ్చంపాలెం, నగరంపాలెం, తాడిపూడి, కించుమండ, బోడిగరువు, నేరెళ్ళపూడి, మదన గరువు, వీరబంద్రిపేట, చీడికాడమండలంలోని జయపురం, ముడిచర్ల, కోండింపూడి, గొప్పూరు, చేరుగుబల్లి, మళ్ళపాడు, జాజులపాలెం, గొడుగు మామిడి, రెళ్ళలపాలెం, కొత్తవీధి, బందవీధి, కొండవీధి, మాడుగుల మండలంలోని మామిడి పాలెం, చిన బొడ్డరేవు, అనందపురం, లక్ష్మీపురం, అజయ్ పురం, కొండవీధి, చినపిట్టగెడ్డ, రాసగొప్పూరు, సిరిపురం, వీరనారాయణం, కొండవీధి, చినగొర్రె గెడ్డ, పెదగొర్రె గెడ్డ, పశువుల బంద, జోగంపేట, రాయిపాలెం, కామకూటం, శంకరం,గొప్పూరు, బుట్లజాలంపల్లి ,చలిసింగం గ్రామాలకు రోడ్లు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలా చూస్తే జిల్లాలోని నాన్ షెడ్యూల్డ్ ఏరియా గిరిజన గ్రామాల్లో వందలాది గ్రామాలకు రోడ్లు సౌకర్యం లేదు. వెంటనే పాలకులు నిర్లక్ష్యం విడనాడి నాన్ షెడ్యూల్డ్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని సిపిఎం జిల్లా కార్యవర్గసభ్యులు డి.వెంకన్న డిమాండ్ చేస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన సుదీక్ష జూనియర్ కాలేజ్

విశాలాంధ్ర - గాజువాక సిటీ : కూర్మన్నపాలెం సుదీక్ష జూనియర్ కాలేజీ విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటారు. సాయికౌశిక్ 99.53 శాతం మార్కులు, కాయల తరణ్ 97.78 మార్కులు, సత్యం కుమార్ఝా 97.41, వి.జస్వంత్ 97.25, 95 % మార్కులు సాధించిన వారు ఏడుగురు, 90% మార్కులు సాధించిన మరో 15 మంది విద్యార్థులను కళాశాల చైర్మన్ అప్పలనాయుడు అభినందించారు. ముఖ్య అతిదిగా బీజేపి గాజువాక అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ విశాఖ విమానాశ్రయం సలహాదారుల కమిటీ సభ్యులు కరణంరెడ్డి నరసింగరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజి అధ్యాపకులు ఉమామహేశ్వరరావు, మాస్టర్ రాంశంకర్, మాస్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాల రికార్డులు పక్కాగా అమలు చేయాలి

విశాలాంధ్ర - దేవీపట్నం: పాఠశాల రికార్డులను పక్కాగా అమలు చేయాలని మండల విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వర రావు ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఇందు కూరుపేట గ్రామంలోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాలెండర్ ప్రకారంగా సిలబస్ పూర్తి చేయాలని, సకాలంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పరీక్ష పేపర్లను దిద్ది విద్యార్థులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వెలుగు ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

సిపోరమ్మ మొదటి జ్ఞాపకార్థ కూడిక

విశాలాంధ్ర - విశాఖ సిటీ: సీతమ్మధార, హెచ్ బి కాలనీలో జీవీఎంసీ దండు బజార్ ఎంవీడీయం స్కూల్ ప్రధానోపాధ్యాయిని స్వర్గీయ సిపోరమ్మ మొదటి జ్ఞాపకార్థ కూడిక జరిగింది. ముందుగా స్వర్గీయ సిపోరమ్మ చిత్రపటానికి పూలమాలంకృతలను చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొన్నారు. ఈ సభకు సభాధ్యక్షులుగా క్రైస్ట్ చర్చ్ అధ్యక్షులు విజయకుమార్, ముఖ్య ప్రసంగికులుగా ఏలూరు డయాసిస్ అధ్యక్షులు ఎన్ జే ఎస్ డి రాజు దేవుని సందేశం ఇవ్వడం జరిగింది. జాన్ వెస్లీ మాట్లాడుతూ సిపోరా అమ్మ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ప్రేమానందం జాకబ్ జార్జి వెంకటేశ్వరరావు జయానంద్ సిఫొరమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో బుధ వారం వెలుగు కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్ ఛైర్మన్ గంగరాజు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఆరు రక్తదాన శిబిరాలు నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రహ్మణ్యచారి, ఎంపిడిఓ బాపన్నాదొర, వైసిపి నాయకులు దాట్ల వెంకటేశ రాజు, వైద్యాధికారి నికిత, ఎంఈవో తాతబ్బాయిదొర, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఓ సురేష్ పాల్గొన్నారు.

హట్కే లాంచ్ మోటో ఈ13తో మోటోరోలా

విశాలాంధ్ర - విశాఖ సిటీ: స్మార్ట్ ఫోన్ బ్రాండ్ మోటోరోలా ఇప్పుడు తన సరికొత్త ఈ సిరీస్ ఫ్రాంచైజీలో మోటో ఈ 13ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది ఆల్-ఇన్-వన్ స్మార్ట్‌ఫోన్. ఈ సెగ్మెంట్‌ని 4జీబీ ర్యామ్‌తో రూపొందించింది. ఇందులో యూనిసోక్ టీ606 ఆక్టా కోర్ ప్రాసెసర్, 64 జీబీ స్టోరేజ్‌తో బలమైన "హాట్కే" పనితీరును నిర్ధారిస్తుంది. ఈ స్మార్ట్‌ఫోన్ రెండు వేరియంట్‌లలో రూ.6,999, రూ.7,999 ధరతో అందుబాటులో ఉన్నాయి.

11న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికలు

విశాలాంధ్ర - నర్సీపట్నం: రాష్ట్రస్థాయి అండర్ 7 బాల బాలికల చదరంగం పోటీలకు ప్రాతినిధ్యం వహించే అనకాపల్లి జిల్లా జట్టు ఎంపికలు ఈనెల 11న అనకాపల్లిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా టోర్నమెంట్ ఇంచార్జ్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ పోటీలు అనకాపల్లి గాంధీనగర్‌లోని ఇన్కమ్ టాక్స్ వీధిలోగల సాయి శక్తి విద్యా సంస్థలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 10వ తేదీలోగా 9866846146, 7032562545కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలన్నారు.

ఒడిశా పాఠశాల పిల్లలకు మధ్యాహ్న భోజనం

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని మద్ది పంచాయతీలో కొత్తగా ఏర్పాటు చేసిన ఒడిశా స్కూల్ పిల్లలకు మౌలిక వసతులతో పాటు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. డీఈఓ, ఏసీపీ సూచనలతో ఎంపీపీ, ఎంఈఓ, ఏఎల్ఎస్ఓ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అక్షయపాత్ర ద్వారా పిల్లలకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పేరుతో రుషికొండ బీచ్ ప్రైవేటీకరణ దారుణం

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖ నగరాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పి, రుషికొండ బీచ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దారుణమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అన్నారు. రుషికొండ బీచ్ ప్రైవేటీకరణ, బీచ్ ట్యాక్స్ రద్దు చేయాలని, ముడసర్లోవ పార్క్ పిపిపి పేరుతో కట్టబెట్టడంను నిరసిస్తూ జనసేన నేతృత్వంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం నిరసన చేపట్టి మాట్లాడారు. రుషికొండ బీచ్‌ను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి గత మూడు దఫాలుగా టెండర్లు పిలిచారన్నారు. నిన్న చివరి టెండర్ జరిగిందని, బీచ్‌లో ప్రవేశానికి టిక్కెట్లు పెట్టి ప్రజలను దోచుకోనున్నారన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన ఇన్చార్జ్ పంచకర్ల సందీప్, జీవీఎంసీ కార్పొరేటర్లు వసంత లక్ష్మి, కందుల నాగరాజు, దల్లి గోవింద్, మత్స్యకార ప్రధాన కార్యదర్శి మూగి శ్రీనివాస్‌రావు, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఇంచార్జ్ పసుపులేటి ఉషా కిరణ్, చోడవరం ఇంచార్జ్ పీవీఎస్ఎన్ రాజు, దక్షిణ నియోజకవర్గ నాయకులు శివ, అర్జున్, విగ్నేశ్వరి, తెలుగు లక్ష్మి, దుర్గా, లుక్స్ గణేష్, మచ్చ రాజు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ 100% వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా ఏప్రిల్ మొదటి వారంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షులు జె.అయోధ్య రామ్ పిలుపునిచ్చారు. ఉక్కునగరంలోని స్టీల్ సిఐటియు కార్యాలయంలో విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయోధ్యరాం మాట్లాడుతూ రాష్ట్ర ఎంపీల సహాయ సహకారాలతో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉన్న ఇతర రాష్ట్ర ఎంపీలను కలిసి వారి మద్దతు కూడగట్టడానికి ఢిల్లీలో కొన్ని రోజులు నివాసం ఉండాలని ఆయన అన్నారు. ఈ సమయాన్ని వెచ్చించి చలో ఢిల్లీ కార్యక్రమం ప్రాధాన్యతను కార్మికులకు వివరించి వారిని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, జిల్లా సిఐటియు అధ్యక్షులు కెఎం శ్రీనివాస్, స్టీల్ సిఐటియు నాయకులు పి.శ్రీనివాసరాజు, బి.అప్పారావు, యు.వెంక టేశ్వర్లు, బిఎన్ మధుసూదన్, పుల్లారావు, టివికె రాజు, గంగాధర్, నీలకంఠం, శశి రెడ్డి, కె.బాలశౌరి, బి.మహేష్, డి.సత్యనారాయణ, ఎంఎస్‌వి ఉమామహేశ్వరరావు, దేముడు నాయుడు పాల్గొన్నారు.

సదస్సుల పేరిట వీధి వ్యాపారుల కడుపు కొట్టొద్దు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీ-20 గ్లోబల్ సమ్మిట్ పేరతో తోపుడు బళ్ళు, చిరు వ్యాపారస్తుల తొలగింపును ఆపాలని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విశాఖపట్నం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జి-20 పేరుతో తొలగిస్తున్న తోపుడు బళ్లు, చిరు వ్యాపారులను న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఫ్లీట్ రివ్యూ సందర్భంగా మత్స్యకారులు వేటకు వెళ్ళొద్దని చెప్పాం అని, ఆ సమయంలో వారికి జీవన భృతి ఇచ్చాం అన్నారు. జి-20 సదస్సులకు మేం వ్యతిరేకం కాదని, కాని ఆ పేరుతో తొలగించిన వారికి జీవనభృతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ కోరాడ రాజబాబు, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పాశర్ల ప్రసాద్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్, చిక్కాల విజయ్, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు విఎస్ఎన్ మూర్తి యాదవ్, లొడగల కృష్ణ బొండ జగన్ తదితరులు పాల్గొన్నారు.

కొంపముంచుతున్న కోతులు

విశాలాంధ్ర - దేవీపట్నం: చేతికొచ్చిన పంటను కోతుల భారీ నుంచి కాపాడుకోలేక రైతులు లబో దిబోమంటున్నారు. కోతుల బెడద నుండి పంటలు కాపాడాలని రైతులు మొర పెడుతున్నారు. మండలంలోని దేవారం పంచాయతీ పోతవరం, దేవారం, గండి గుంట గ్రామాలలో రైతులు దాల్వా, వరి పంటలు, మొక్కజొన్న, మినుము పంటలు సాగు చేస్తున్నారని అన్నారు. ఇప్పుడు వంట చేతికొచ్చే సమయానికి కోతులు పంటలను ధ్వంసం చేస్తూ నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ రైతులు కారం శ్రీను, చిన్నప్ప దొర, కారం రామన్న దొర, సూర్యరావు కోరుతున్నారు.

ఘనంగా విత్తనాల పండుగ

విశాలాంధ్ర - జీకేవీధి: జీకేవీధి మండలం రింతాడ పంచాయతీ పారికలు గ్రామంలో గ్రామ పెద్దల సహకారంతో పూజారి కిల్లో కృష్ణ ఆధ్వర్యంలో విత్తనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకు దేవునికి వివిధ రకాల నైవేద్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో పశుసంపద బాగుండాలని, ప్రకృతి దేవతలకు పూజలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిల్లో జాంబ్రి, చిన్నబ్బి, రాజబాబు, కొర్ర జగన్, కిల్లో మల్లు పడాల్, పాంగి రామయ్య, కిల్లో సత్తిబాబు తదితరులు కోరారు.

గల్లంతైన యువకుడు మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - పాయకరావుపేట రూరల్: మండలంలోని రత్నయ్యంపేట సముద్రంలో గల్లంతైన కాకినాడకు చెందిన గుమ్మడి రుత్విక్ (24) మృతదేహం మండలంలోని రాజానగరం సముద్రతీరానికి కొట్టుకు వచ్చినట్లు ఎస్సై జోగారావు తెలిపారు. శవపరీక్ష నిర్వహించి పోర్టు మార్టం నిమిత్తం నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రుత్విక్ సోమవారం సముద్రంలో గల్లంతైన విషయం తెలిసిందే.

కోయ బాల సాహిత్య కార్యశాల

విశాలాంధ్ర - చింతూరు: చింతూరు మండలం రామన్నపాలెం గ్రామంలో కోయత్తోర్ బాట ఆధ్వర్యంలో జరుగుతున్న కోయ బాల సాహిత్య కార్యశాల సెమినార్‌లో సినీ గాయకుడు జయరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. షెడ్యూల్ ప్రాంతంలోని సంస్కృతి, సంప్రదాయలను, జానపదాలు, పద్యాలు చాలా గొప్పగా కొనియాడారు. బాల సాహిత్యం రాబోయే తరానికి పునాదిగా మారాలని అన్నారు. ప్రముఖ సాహిత్యవేత్త డాక్టరు సురేందర్ రాజు, ప్రముఖ కవి మోహన్‌బుషి పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కుంజా రామారావు, పీసం పొద్దయ్య, తెల్లం కృష్ణ, కట్టాం అశోక్, దుమ్మిరి భీమమ్మ, సోడి మురళి పాల్గొన్నారు.

వింత ఘటన

కుక్క దగ్గర పాలు త్రాగుతున్న ఆవు దూడ



విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పెద్దిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో రాయన వెంకట్రావు కల్లాల దగ్గర వింత ఘటన చోటుచేసుకుంది. వీర బ్రహ్మంగారు చెప్పినట్లు కొన్ని సంఘటనలు యదార్థంగా కళ్లకు నిండుగా కనిపిస్తున్నాయి . భవిష్యత్తులో ఏమేమి జరగ బోతున్నాయో మనం ముందే పరిచయం అవుతున్నాయి. దానికి మనం ఈ సంఘటన ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఆవు దూడ కుక్క దగ్గరి పాలు తాగుతుంది. ఈ సంఘటన అందర్నీ ఆశ్చర్యం గురిచేసింది. ఎందుకంటే ఎప్పుడు కూడా ఇలాంటి సంఘటన ఎక్కడ జరగలేదు. ఈ వింతను కొద్దిపాటి మంది మాత్రమే చూడగలిగే అవకాశం లభించింది. ఇంకా భావితరాలకు ఎలాంటి సంఘటనలో ఎదురవుతాయో మనం చూడాలి.

సీజ్ చేసిన వాహనాలకు నేడు వేలం

విశాలాంధ్ర - పాడేరు: స్థానిక పాడేరు డివిజన్ పరిధిలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో పలు కేసుల్లో పట్టుబడిన వాహనాలకు బహిరంగ వేలం ఈ నెల 9వ తేదీన ఎస్ఈబి స్టేషన్‌లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరిండెంట్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేయనున్నారు. వాహనాలను ఎంవీటీ నిర్ధారించిన ధర నుండి బహిరంగ వేలం వేసి, పాడిన మొత్తం అదనంగా జీఎస్టీ కూడా చెల్లించాలని తెలిపారు. ఆసక్తి గలవారు వేలంపాటలో పాల్గొనదల్చిన వారు 5000 /- చెల్లించి, టోకెన్లు పొంది వాహనాలు కొనుగోలు చేయ వచ్చునని,అన్నారు.వేలంపాట కు వానాలు పొందలేని వారికి అడ్వాన్స్ నగదు వెంటనే ఇవ్వబడుతుందని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఓ ప్రకటనలో తెలిపారు.

20 నుండి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం

విశాలాంధ్ర - నర్సీపట్నం,: ఈనెల 20వ తేదీ నుండి 27 వరకు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ వెల్లడించారు. ఈనెల 11 నుండి జరగవలసిన ఈ కార్యక్రమం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఒక్కో క్లస్టర్ లో 50 నుండి 60 గృహాలు ఉంటాయని రోజుకు 10 గృహాల చొప్పున నిర్ణయించుకుని వారం రోజుల్లో కార్యక్రమం పూర్తిచేయాలని ఆయన అన్నారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ముందుగానే సమావేశం ఏర్పాటు చేసుకొని కార్యక్రమం గురించి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన కార్యక్రమాలు వారికి వివరించి, ప్రభుత్వ పాలనపై వారి అభిప్రాయాలు సేకరించాలన్నారు. ఈనెల మూడవ తేదీ నుండి 7వ తేదీ వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశాలను భారీ ఎత్తున విజయవంతం చేసినందుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

భార్యను హత్య చేసిన ముద్దాయికి జీవిత ఖైదు

విశాలాంధ్ర - చింతపల్లి : భార్యను హత్య చేసిన ముద్దాయికి జీవిత ఖైదీతో పాటు రూ.2వేల నగదు జరిమానాగా విధించిన సంఘటన మండలంలో చోటు చేసుకున్న విషయం పాఠకులకు తెలిసిందే. వివరాల్లోకి వెళితే అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతపల్లి మండలం, కుడుముసారి పంచాయతీ, నిమ్మపాడు గ్రామంలో నివాసముండే కొర్ర లక్ష్మి గ్రామంలో సుమారు 20 ఏళ్ల గా అంగన్వాడి కార్యకర్తగా పనిచేస్తుంది.

ఆమె భర్త అనివార్య కారణాలతో మృతి చెందడంతో అదే గ్రామంలో నివాసం ఉండే కొర్ర రవి అంగన్వాడి కార్యకర్త లక్ష్మిని రెండవ వివాహం చేసుకున్నాడు. రవి మద్యం సేవించి అంగన్వాడి కార్యకర్త లక్ష్మిని రోజు వేధించేవాడని, అదే క్రమంలో 2017 న ఆమె కాళ్లు, చేతులు కట్టి మేడం నులిపి హత్య చేశాడని సీఐ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ మేరకు విశాఖపట్నం ప్రిన్సిపాల్ జిల్లా జడ్జ్ గుత్త గోపి ముద్దాయికి జీవిత ఖైదు రూ.2 వేలు జరిమానా విధించడం జరిగిందని ఆ ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రావికమతం: ఉపాధి హామీ పథకాన్ని జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమార్ వరహాలు తెలిపారు. కవగుంట గ్రామంలో ఉపాధి కూలీలందరికీ బుధవారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రోజువారి వేతన కూలి 257 రూపాయలు ప్రతి ఒక్కరూ పొందేలా పనిచేయాలని సూచించారు. ఈ పథకంలో ఆడ, మగ బేధం లేకుండా సమానమైన కూలీ సొమ్మును ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏడాదికి ఒక్కొక్క జాబు కార్డుకు కల్పించిన 100 రోజులను ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకాన్ని గ్రామంలో ఉన్న పేద ప్రజలు వలసల బాట పట్టకుండా తన సొంత గ్రామంలోనే ఉండి పనిచేసుకునే విధంగా ప్రభుత్వం ఈ పథకం ద్వారా కూలీలందరికీ ఉపాధి పని కల్పించడమే కాకుండా గ్రామ అభివృద్ధికి కూడా ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మోహన్, ఎఫ్.ఏ .వరస్వామి పలువురు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సమాజంలో పాత్రికేయులది ప్రత్యేక స్థానం

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి: సమాజంలో పాత్రికేయులది ప్రత్యేక స్థానమని, వారి సేవలు సమాజంలో ప్రతి ఒక్కరికి అవసరమని పాడేరు శాసనసభ్యులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు.

జనవరి 31న నూతనంగా ఎన్నిక కాబడిన చింతపల్లి ప్రెస్ క్లబ్ కార్యవర్గం పాడేరు శాసన సభ్యులు భాగ్యలక్ష్మి రాష్ట్ర మెడికల్ టి.నర్సింగరావు దంపతులను బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఘనంగా సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ సమాజంలో ఏ సమస్య పరిష్కారం కావాలన్నా అది పాత్రికేయుల ద్వారానే బయటి ప్రపంచానికి, రాజకీయ నాయకులు, అధికారులకు తెలిసే అవకాశం ఉందన్నారు. త్వరలోనే పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, జీకే వీధి ఎంపీపీలు అనూష దేవి, బోయిన కుమారి, సర్పంచ్ దురియా పుష్పలత, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, జీకే వీధి వైకాపా మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, చింతపల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు దేశెట్టి సత్యనారాయణ (సతీష్), ఎస్.వనరాజు, గౌరవ అధ్యక్షుడు వీజే దయానంద్, చింతపల్లి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

విదేశీ విద్యను నీరు గార్చుతున్న ప్రభుత్వం

టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - మునగపాక: నిరుపేదల విదేశీ విద్యను వైయస్సార్ ప్రభుత్వ పాలనలో మాటలకే పరిమితం అయిందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు ఆరోపించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేద విద్యార్థులు విదేశీ, ఉన్నత చదువుల కోసం ఆర్థిక భరోసా కల్పించే వారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో 2013 నుండి 2019 సంవత్సరం వరకు ఆంధ్రప్రదేశ్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, కాపు వర్గాల పేద విద్యార్థులకు విదేశీ చదువులకై సుమారు 4923 మంది విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి పది లక్షల చొప్పున 364.98 కోట్ల నిధులను ఖర్చు చేసిందన్నారు. అయితే మాటలు తప్ప, చేతల్లో చూపని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి గత మూడున్నర ఏళ్లగా పేద విద్యార్థుల విదేశీ చదువును విస్మరించారన్నారని అన్నారు. ప్రస్తుతం కేవలం 213 మంది విద్యార్థుల చదువుకు 19 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు దాడి ముసిలి నాయుడు, మొల్లేటి సత్యనారాయణ, సబ్బి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, ఆడారి గోవింద్, బొడ్డేడ ప్రసాద్, మళ్ళ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: కోర్టు ఆదేశాల ప్రకారం రోడ్డు మార్జిన్ వ్యాపారస్తులకు ప్రత్యామ్నాయ స్థలం చూపించిన తర్వాతనే రోడ్డు వేసుకోవాలని విజయ గణపతి చిల్లర వర్తకుల సంఘం కార్యదర్శి గుల్లా నాగరాజు కోరారు. రోడ్డు విస్తరణ కోసం నర్సీపట్నం ఆర్డీఓతో సమావేశం ఉన్నట్లు పంచాయతీ కార్యదర్శి నుండి నోటీసులు జారీ అయ్యాయని తెలిపారు. అయితే సమావేశం జరిగే జిల్లా పరిషత్ అతిథి గృహం వద్ద, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆర్డీఓ కోసం చాలా సమయం వేచి చూశామని తెలిపారు. అధికారులు వారి పనుల్లో వారు ఉన్నారని తెలిపారు. అయితే తామేమి రోడ్డు అభివృద్ధికి ఆటంకం కలిగించేవారం కాదని, కోర్టు ఆదేశాల ప్రకారం అధికారులు నడుచుకోవాలని కోరుతున్నట్లు గుల్లా నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు సూరా సుబ్రమణ్యం, అధ్యక్షులు బొక్కా గోవిందు, కిల్లాడ వెంకటరమణ, వరదా శంకరరావు, దావీదు, కక్కల అమ్మాజి తదితరులు పాల్గొన్నారు.

8 వేల వేతనదారులకు ఉపాధి కల్పన లక్ష్యం

విశాలాంధ్ర - నాతవరం: వచ్చే వారంలోగా రోజు ఒక్కంటికి ఎనిమిది వేల వేతనదారులకు ఉపాధి పని కల్పించడమే ధ్యేయంగా పని చేయాలని నాతవరం ఎంపీడీఓ లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. 5450 మంది కూలీలు పని చేశారని, వచ్చే వారం నుంచి లక్ష్యాన్ని అధిగమించేందుకు ఏపిఓ, వీఆర్పీల కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కూలీల సంఖ్య పెంచాలన్నారు.